క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఈఎస్ఐ, ఐడీపీఎల్, మైత్రీవనం, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీనివాసకాలనీ ఈస్ట్, 2ఆర్‌టీ క్వార్టర్స్, ఎస్ఆర్‌నగర్ బస్టాప్ వెనుక ప్రాంతం, గాయత్రీనగర్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ నివాస ప్రాంతం, మూసాపేట క్రాస్‌రోడ్డు, శక్తినగర్, మూసాపేట. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, స్పెన్సర్ బిల్డింగ్, ప్లే గ్రౌండ్ ఏరియా, శీష్ మహల్ థియేటర్ ఏరియా, తాజ్‌వివంతా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

ఉచిత ఆన్‌లైన్ సేవలకు స్పందన



రసూల్‌పురా: శ్రీ గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఉచితంగా అందజేస్తున్న ఇంటివద్దకే ఆన్‌లైన్ సేవలకు ప్రజల నుంచి స్పందన వస్తుందని శ్రీ గణేష్ తెలిపారు. మంగళవారం కార్ఖానా, రసూల్‌పురాలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆన్‌లైన్ సెంటర్లను శ్రీ గణేష్ సందర్శించి పనితీరును పరిశీలించారు. ప్రజావసరాలకు అనుగుణంగా అన్ని రకాల సేవలను ఉచితంగా అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలను పొందేందుకు పేదలు ఆన్‌లైన్ సేవల కోసం తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని దృష్టిలో ఉంచుకుని తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సేవలను ఏర్పాటు చేశామన్నారు.

విశ్వరూప సభను జయప్రదం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఆగస్టు రెండో వారంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ కోరారు. మంగళవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కొమ్ముశేఖర్, అజయ్‌మాదిగ, మహేష్ మాదిగ, ప్రదీప్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉజ్జయినీ ఆలయ హుండీ ఆదాయం రూ.64.42 లక్షలు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర సందర్భంగా హుండీ ద్వారా రూ.64,42,133 ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. గత నెల 9,10వ తేదీల్లో అమ్మవారి బోనాల జాతర జరిగిన విషయం విదితమే. సోమవారం ఉద యం నుంచి రాత్రి వరకు ఈవో మనోహర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రామేశ్వర్, భక్తుల సమక్షంలో హుండీని లెక్కించారు.


◆ సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అభినందనలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఇటీవల ఓయూ వీసీ ప్రొ.రవీందర్ టీ–శాట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం పట్ల బీఆర్ఎస్ క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్ మార్క్ అభినందనలు తెలిపారు. మంగళవారం వీసీ ఛాంబర్‌లో ప్రొ.రవీందర్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేసి, రూసా ఫెలోషిప్‌లు, ప్లేస్‌మెంట్ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం విస్తరణ, కాలేజీలు, హాస్టళ్లలో మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలని కోరారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కంటోన్మెంట్: కంటోన్మెంట్ వాసుల సుదీర్ఘ కల అయిన స్కైవేల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల బీఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదితల ఆధ్వర్యంలో జూబ్లీ బస్‌స్టేషన్ చౌరస్తాలో కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిపాదిత స్కైవేలతో పాటు మెట్రో కంటోన్మెంట్ ప్రాంతం గుండా రెండు మెట్రో రూట్‌లను సైతం ఏర్పాటు చేయనుండటం సంతోషకరం అన్నారు. టీఎన్ శ్రీనివాస్, సంతోష్, సదానంద్ గౌడ్, తేజ్ పాల్, నర్సింహ ముదిరాజ్, అజయ్, మురళీ యాదవ్, మల్లేశ్, నరేశ్ , రమేశ్ పాల్గొన్నారు.





ఎన్ఆర్ఎస్ హాస్టల్ లోపల భాగం

పెచ్చులూడుతున్నాయ్.. పక్కకు జరగండి!

- శిథిలావస్థలో ఓయూలో పాత భవనాలు
- ఆందోళనకు గురవుతున్న విద్యార్థులు
- విస్మరిస్తున్న అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో పాత భవనాలతో ప్రమాదం పొంచి ఉంది. గతంలో నిర్మించిన ఏళ్ల నాటి భవనాలు శిథిలావస్థకు చేరాయి. పరిశోధన విద్యార్థుల కోసం 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఎన్ఆర్ఎస్ (న్యూ రీసెర్చ్ స్కాలర్స్) హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్నానాల గదులు, మరుగుదొడ్లకు అమర్చిన పైపుల నుంచి మురుగు నీరు కారడంతో గోడలు పాడయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరుగుదొడ్లలో పైకప్పుల పెచ్చులు ఊడిపడ్డాయి. నీటితో నానిన గోడలను పూర్తిగా తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. క్యాంపస్‌లో పాత హాస్టల్ భవనాలతో పాటు భోజనశాలలు, కొన్ని కాలేజీలు, కార్యాలయాలు వర్షాలకు కురుస్తున్నాయి. భవనాలు కురవడంతో భోజనశాలలో నీరు చేరుకుంటుందని పరిశోధన విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పాత భవనాలకు గతంలో బిల్డింగ్ డివిజన్ సిబ్బంది ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టే వారు. ఓయూలో నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడంతో మరమ్మతు పనులు సక్రమంగా జరగడం విద్యార్థులు ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి పాత భవనాలను సకాలంలో మరమ్మతులు చేపట్టకుంటే కూలిపోయే ప్రమాదం ఉందని భయాందోళనకు గురవుతున్నారు.

తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా లాంటిది

ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్ సువర్ణ

అడ్డగుట్ట: నవజాత శిశువులకు వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్ ఎ.సువర్ణ చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మారేడుపల్లి మండల పరిధిలోని అడ్డగుట్ట 1, 4 అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ.. తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా లాంటిదని, అదే విధంగా తల్లికి కూడా బ్రెస్ట్ కేన్సర్ రాకుండా ఉంటుందని తెలిపారు. ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించడం ద్వారా బిడ్డకు ఏ విధమైన అనారోగ్య సమస్యలు రావని, బిడ్డకు ఎదుగుదలకు ఎంతో తోడ్పడుతుందన్నారు. అనంతరం బాలింతలకు గుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఎస్. పద్మ, జే. రమాదేవి, తల్లులు వాణి, ముక్తి, రుక్మిణి, రచన, అనూష తదితరులు పాల్గొన్నారు.



బాలామృతం, గుడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సమాజ సేవలో లయన్స్ క్లబ్ పునరంకితం

లాలాపేట: ప్రపంచ వ్యాప్తంగా 108 సంవత్సరాల నుంచి సమాజ సేవలో లయన్స్ క్లబ్ పునరంకితం అయినట్లు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320–సీ గవర్నర్ హరీష్‌రెడ్డి తెలిపారు. రీజియన్ చైర్ పర్సన్ కె. శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం లాలాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాత పుస్తకాలు ఇతర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం లయన్స్ క్లబ్ ద్వారా విద్యారంగంలో పేద విద్యార్థులను ప్రోత్సహించాలనేదే లక్ష్యంగా పెట్టుకున్నామని ఇందులో భాగంగా నగరంలోని 18 ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్ల నిర్మాణం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, ఇన్నారెడ్డి, కల్లెం కృష్ణారెడ్డి, సంపత్‌గౌడ్, మనోజ్ యాదవ్, జైపాల్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.



రాత పుస్తకాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

భవన నిర్మాణ కార్మికుల హర్షం

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గౌరి నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉన్నటువంటి పథకాల్లో ప్రస్తుతం చేసిన మార్పుల ద్వారా కార్మికులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కార్మికులు సహజ మరణం చెందితే రూ. 1 లక్ష నుంచి రూ. 3 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 6 లక్షల నుంచి రూ. 10 లక్షలు పెంచడం, ఇదే విధంగా మరికొన్ని పథకాలను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, పా కాల యాదగిరి, అంజయ్య, రామస్వామి, సింగరయ్య, బాలరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ కార్మికుల సంఘం సభ్యులు

అన్నాభావ్ సాటే జయంతి

బౌద్ధనగర్: పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో మంగళవారం కవి సామ్రాట్ డాక్టర్ అన్నా భావ్‌సాటే 103వ జయంతి వేడుకలు సికింద్రాబాద్ కోఆర్డినేటర్ దప్పు మల్లికార్జున్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ రాగటి సత్యం మాదిగ డాక్టర్ అన్నాభావ్‌సాటి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతీ ఒక్కరికి సమాన హక్కులు ఉండేలా పోరాటం చేస్తూ ప్రజలను చైతన్య పర్చిని గొప్ప వ్యక్తి అన్నాభావ్ సాటే అని పేర్కొన్నారు. శరత్ బాబు, బాబు పాటేకర్, సామ్యూల్, చాగంటి యాదగిరి, ప్రభాకర్, నరసయ్య, బాబు, మాయాబ్రహ్మం పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

గ్రూప్-2 వాయిదాకు వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్–2 రాత పరీక్ష వాయిదా వేయాలని టీఎస్ విద్యార్థి జేఏసీ చైర్మన్ మిడతనపల్లి విజయ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో చైర్మన్‌తో పాటు ఇతర అధికారులను తొలగించకుండా పరీక్షలు నిర్వహించడంపై అసెంబ్లీలో చర్చించాలని వినతిలో కోరారు. ప్రిపరేషన్ కోసం మూడు నెలలు వాయిదా వేయించాలన్నారు.



ఈటలకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు



బురదలో కాలు పెడితేనే బడిలోకి అడుగులు

నగరంలో గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు లాలాపేటలోని గడి స్కూల్ ఆవరణలో వర్షం నీరు నిలిచి బురద పేరుకుపోయింది. పాఠశాలలోకి వెళ్లాలంటే బుడిబుడి అడుగులు వేస్తూ వెళ్లాల్సి వస్తోంది. పొరపాటున కాలు జారితే ఇంటికెళ్లి దస్తులు మార్చుకోవాల్సి పరిస్థితి నెలకొందని విద్యార్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణంలో నిలిచిన నీరు, బురదను తొలగించాలి కోరుతున్నారు. –లాలాపేట

కళ్లకలకపై జాగ్రత్తలు పాటించాలి



డాక్టర్ సాయి శంకర్

అడ్డగుట్ట: కళ్లకలక విషయంలో ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయి శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పుల కారణంగా కళ్లకలక కేసులు పెరుగుతున్నాయని ముఖ్యంగా పిల్లల్లో ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. సాధారణ బ్యాక్టీరియా లేదా వైరల్ ఇన్‌ఫెక్షన్ వల్ల ఈ వ్యాధి సోకుతుందన్నారు. కంటి రెప్పల వాపు, కంటి నుంచి నీరు కారడం, కంటి నొప్పి, దురద వంటివి కళ్లకలక లక్షణాలు అన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కళ్లకలక ఉన్న వారి నుంచి దూరంగా ఉండాలన్నారు. చేతులను క్రమం తప్పకుండా శుభ్రంగా కడుక్కోవాలని, గోరు వెచ్చని నీటితో కళ్లు తుడుచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

రాంగోపాల్‌పేట్: ప్రస్తుతం నగరంలో విస్తరిస్తున్న కళ్లకలక వ్యాధితో జాగ్రత్తగా ఉండటంతో పాటు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే దాని బారిన పడకుండా ఉండొచ్చని సికింద్రాబాద్ అపోలో ఆస్పత్రి కన్సల్టెంట్ ఆప్థమాలజిస్ట్ డాక్టర్ అర్పితరావు పేర్కొన్నారు. కళ్లకలక అనేది అడినోవైరస్, అనేక బ్యాక్టీరియాతో వేగంగా వ్యాప్తి చెందుతుందన్నారు. కంట్లో ఎరుపు, వాపు, నీరు కారడం, పుసులు రావడం, దురద, కనురెప్పలు అతుక్కుని పోవడం దీని లక్షణమన్నారు. ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

వృద్ధుడి అదృశ్యం



బాల్‌రాజ్

బౌద్ధనగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. పార్శిగుట్టలోని సంజీవపురానికి చెందిన బాల్‌రాజ్ (65) సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో చెత్త పారబోసి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.


కదులుతున్న రైలు నుంచి జారిపడి వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

సికింద్రాబాద్: నడుస్తున్న రైలు నుంచి జారిపడి వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా పంచముఖి గ్రామానికి చెందిన వి.కేశవన్ (26) పెయింటర్. బంధువుల ఇంటికి వెళ్లిన కేశవన్ తిరుగు ప్రయాణం కోసం నిడదవోలు స్టేషన్ నుంచి కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరాడు. మల్కాజిగిరి–దయానంద్‌నగర్ రైల్వేస్టేషన్ల మధ్యకి రైలు చేరుకోగానే బోగీ నుంచి జారిపడిన కేశవన్ అక్కడికక్కడే మృతిచెందాడు.

ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య..

సికింద్రాబాద్: ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య వ్యక్తి ఓ మృతి చెంది ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 45 ఏళ్లు ఉంటుందని ఒంటిపై నీలిరంగు గీతల చొక్కా, నీలిరంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. వేగంగా నడుస్తున్న రైలు బోగీ నుంచి కిందపడి మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు.

మర్యాదపూర్వక కలయిక



గాంధీనగర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన రవి, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టిన కొమరయ్య మంగళవారం మంత్రి తలసానిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు. –సనత్‌నగర్

కంటోన్మెంట్ అభివృద్ధికి రూ. 25 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

రసూల్‌పురా: జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ ప్రాంత విలీనం అనంతరం కంటోన్మెంట్ ప్రాంతాన్ని ప్రత్యేక సర్క్యులర్‌గా ప్రకటించి అభివృద్ధికి తగిన కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం కంటోన్మెంట్ లీప్యాలెస్‌లో వికాస్ మంచ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంచ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కంటోన్మెంట్ విలీన అనంతరం తీసుకోవాల్సిన చర్యల విషయమై రాష్ట్ర ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, అదనపు సెక్రటరీ సైదాలును కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కంటోన్మెంట్ అభివృద్ధికి రూ. 25 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడంతో పాటు పది సంవత్సరాల కాలపరిమితి విధించాలని, విలీనమైన భూములపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి వాటిని సక్రమంగా వినియోగించాలని దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు అందజేసి భూములపై హక్కులు కల్పించాలని వినతి పత్రంలో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ఎస్ఎన్‌డీపీ, ఎస్ఆర్ డీపీ అమలు చేయాలని రోజువారి తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు, వైద్య సదుపాయాలు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లు, క్రీడా మైదానాలు, మహిళ స్వ శక్తి భవనాలు నిర్మించాలని కోరామన్నారు. ఈ సమావేశంలో ఏబెల్, సంకి రవీందర్, ప్రభుగుప్తా, ఫస్సీ, జమీల్, గజ్వేల్ భరత్, నాగినేని సరిత, ప్రకాష్, బొట్టు ప్రభాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంకి రవీందర్

లబ్ధిదారుల చెంతకే సంక్షేమ పథకాలు

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



చెక్కులు పంపిణీ చేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: దళారులతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందించేందుకు తమ కార్యాలయంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ చెప్పారు. మంగళవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 56 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్ని రకాల సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడంలో తాము ముందున్నామన్నారు. పథకాలు ఏవైనా దరఖాస్తులు తమ కార్యాలయంలో అందించడం లేదా ఆన్‌లైన్‌లో చేసుకుని తమ కార్యాలయాన్ని సంప్రదిస్తే తమ సిబ్బంది అన్నీ తామై చూసుకుంటున్నారని పద్మారావుగౌడ్ తెలిపారు. ఎవరూ దళారులను ఆశ్రయించకుండా నేరుగా తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, సునిత, బీఆర్ఎస్ నాయకులు తీగుళ్ల కిషోర్, రామేశ్వర్‌గౌడ్, జలంధర్ రెడ్డి, రాజసుందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

సికింద్రాబాద్: కొత్త పెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకునేంత వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని దక్షిణ మధ్యరైల్వే మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు చెప్పారు. మంగళవారం సికింద్రాబాద్‌లో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువగర్జన కార్యక్రమంలో శంకర్‌రావు పాల్గొని మాట్లాడారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రాజీలేని పోరాటాలు చేశామన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధంగా మారిన కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసే వరకు ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామన్నారు. పాత పెన్షన్ విధానాన్ని కోరుతూ పార్లమెంట్ ముట్టడి కోసం ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శంకర్‌రావు పిలుపునిచ్చారు. చిలకలగూడ కూడలి నుంచి ఇంజినీరింగ్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉదయ భాస్కర్, రవీందర్, ఖాజాబాబా, యుగంధర్‌యాదవ్, స్వామి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



యువగర్జన ర్యాలీలో పాల్గొన్న మజ్దూర్ యూనియన్ నాయకులు

సమస్యల పరిష్కారం



మ్యాన్‌హోళ్లను శుభ్రం చేస్తున్న సిబ్బంది

అడ్డగుట్ట: సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్ తెలిపారు. వారం రోజులుగా కురిసిన వర్షాలకు పలు బస్తీల్లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను మంగళవారం మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తుకారాం గేట్ మరాఠా బస్తీతో పాటు పలు బస్తీల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా రోడ్లకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలను సంబంధిత సిబ్బందితో తొలగింపజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు సుధాకర్, శ్రీరాములు, వడ్లూరి రవి, గోపి, బాబు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు తెలపాలి

సికింద్రాబాద్: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పడం ద్వారా బీఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు కాంగ్రెస్ నాయకులు ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలని టీపీసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే పిలుపునిచ్చినట్లు సికింద్రాబాద్ కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశ్‌రావు తెలిపారు. మంగళవారం మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, కార్యదర్శి గౌరీశంకర్‌తో కలిసి నోముల ప్రకాశ్‌రావు గాంధీభవన్‌లో మాణిక్‌రావు ఠాక్రేను కలిశారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ద్వారా మాత్రమే పేద, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్న వాస్తవాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరినట్లు చెప్పారు.



మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన నోముల ప్రకాశ్‌రావుగౌడ్

'డబుల్' ఇళ్లు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం

జీజేపీ నాయకులు



సికింద్రాబాద్: అర్హులైన లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని సికింద్రాబాద్ బీజేపీ నాయకులు విమర్శించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ మహంకాళి ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి మాట్లాడారు. డబుల్ బెడ్రూమ్ ఇస్తామన్న హామీతో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అదే హామీ విఫలం కావడంతో అధికారం కోల్పోవడం ఖాయమన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోనూ పదివేల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కనీసం ఐదు వందలు కూడా నిర్మించి ఇవ్వలేక పోయారన్నారు. ఎమ్మెల్యే వ్యక్తిగత, కుటుంబ ప్రగతి సాధించుకోవడం మినహా సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని విమర్శించారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

సనత్‌నగర్: సీఎంఆర్ఎఫ్ పేదలకు అండగా నిలుస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద బల్కంపేటకు చెందిన రవి కుమార్‌కు వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల మంజూరు పత్రాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదరికం కారణంగా వైద్యం చేయించుకోలేకపోతున్న అనేకమంది ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం పొంది మెరుగైన వైద్యంతో ఆనందమైన జీవితాన్ని గడుపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి తలసాని